క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్‌గా బాబూలాల్ బాధ్యతల స్వీకరణ



గీసుకొండ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా జి.బాబూలాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను పోలీసు శాఖ మల్టీజోన్-1 ఐటీకి అటాచ్ చేసింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న బాబూలాల్ ఇక్కడకు బదిలీ అయ్యారు.

బాలికపై అత్యాచార యత్నం

చెన్నారావుపేట : బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి యత్నించిన ఘటన మండలంలోని బోజేర్వు సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలిక 9వ తరగతి చదువుతోంది. బాలిక పాఠశాలకు వెళ్లి వస్తుండగా గూడూరు మండలంలోని ఓ తండాకు చెందిన యువకుడు.. బాలికను ద్విచక్రవాహనం ఎక్కించుకున్నాడు. బోజేర్వు గ్రామ సమీపంలోకి రాగానే ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక తప్పించుకుని ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండలంలోని కమలాపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కమలాపురానికి చెందిన మహ్మద్ రహీం (30) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య యాస్మిన్, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం ఎవరూ లేని సమయంలో ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌కు రహీం ఉరేసుకోగా స్థానికులు అతడి తండ్రి జాకీర్‌కు సమాచారం అందించారు. జాకీర్ వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే రహీం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. జాకీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

చెన్నారావుపేట : మండలంలోని బోజేర్వులో తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన విషాద ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన లింగాల తిరుపతయ్య (70) అనారోగ్యంతో మృతి చెందాడు. అయనకు ఇద్దరు కూతుళ్లున్నారు. కొడుకులు లేకపోవడంతో తిరుపతయ్య మృతదేహానికి చిన్న కూతురు శోభ తలకొరివి పెట్టింది. గ్రామస్తులతో కలివిడిగా ఉండే తిరుపతయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన పట్టణంలోని నర్సంపేట-నెక్కొండ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆటో, ఇన్నోవా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు, అందులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన కొలిపాక రాజన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు నీరటి వెంకన్న, ఉపాధ్యక్షుడు కొండా వెంకన్న, కార్యదర్శి రావుల రాజు బాధిత కుటుంబానికి రూ.20 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు అంబటి కుమార్, రమేశ్, కొప్పుల రాజు, నీరటి సంపత్, మొగిలి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ డైరీ ఆవిష్కరణ



నర్సంపేట : పట్టణంలోని శ్రీరక్ష ఆస్పత్రిలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) నూతన సంవత్సర డైరీని డాక్టర్ కావటి విజయ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని ఆకాంక్షించారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలు చేరేలా దిశగా చొరవ చూపాలని సూచించారు. గొర్రెల, మేకల పెంపకందార్లు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధూకర్, జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మల్లేశ్, జక్క రవి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో జాప్యం



ధాన్యాన్ని కాంటా వేస్తున్న హమాలీలు (ఫైల్)

- జిల్లాలో రూ.30 కోట్లు పెండింగ్

పర్వతగిరి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు ఇంకా డబ్బులు అందలేదు. సుమారు 50 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఖాతాల్లో నగదు జమచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చి రబీ పంటలను సాగు చేస్తున్నారు. పర్వతగిరి మండలంలో సుమారు 60 మంది రైతులు ధాన్యం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని 13 మండలాలకు చెందిన సుమారు 600 మంది రైతులకు రూ.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు చెల్లించాలని అన్నదాతలు కోరుతున్నారు.

డబ్బులు పడలేదు..



డిసెంబర్ 19వ తేదీన పర్వతగిరి ఐకేపీ సెంటర్‌లో 40 కిలోల బస్తాలు 148 కాంటా వేసిన. సుమారు వాటి విలువ రూ.1.30 లక్షలు. కాగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు పడలేదు. ప్రభుత్వం చొరవ చూపి ధాన్యం డబ్బులు చెల్లించాలి.

-ప్రేమ్‌చందర్‌రావు, పర్వతగిరి

రూ.30 కోట్లు బకాయి



జిల్లాలో మొత్తం రూ.38 కోట్లు పెండింగ్‌లో ఉండగా.. మంగళవారం రూ.8 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం రూ.30 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రైతుల పూర్తి వివరాల ఇండెంట్ ప్రభుత్వానికి అందించాం. డబ్బులు విడుదల కాగానే పూర్తిస్థాయిలో చెల్లిస్తాం.

- సంధ్య, డీఎం, సివిల్ సప్లయిస్

'గృహజ్యోతి'ని వినియోగించుకోండి

వర్ధన్నపేట : ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేలా ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈ కన్న రాజు కోరారు. పట్టణంలో గురువారం ఆ శాఖ ఉద్యోగులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు) నంబర్, ఆధార్ కార్డు నంబర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది వచ్చినప్పుడు అందుబాటులో లేని వినియోగదారులు విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో లేదా విద్యుత్ సహాయ గణాంక అధికారి కార్యాలయంలో వివరాలు అందజేయాలని కోరారు.

సంగెం : మండల కేంద్రంలో అర్హుల గుర్తింపు ప్రక్రియను విద్యుత్ శాఖ ఏఈ మధుసూదన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు సర్వేకు వచ్చే సిబ్బందికి రేషన్‌కార్డుతోపాటు ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు అందించాలని సూచించారు.



సంగెం : సర్వే ప్రారంభిస్తున్న ఏఈ మధుసూదన్

విధుల్లో చేరిన ప్రత్యేకాధికారి



పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా ఇరిగేషన్ శాఖ డీఈ రాజు గురువారం విధులు చేరారు. గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను అధికారులు, గ్రామస్తులు సోమవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూర రమేశ్, పంచాయతీ కార్యదర్శి కల్లెపు సదానందం, హెచ్‌ఎం లింగమూర్తి, పూర్ణచందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గఫార్, సదానందం, దామోదర్, కరుణాకర్, ప్రణయ్, ఫరీద్, శ్రీధర్, కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, సరిత, ఆశా వర్కర్ మంజుల, నవ్య, కారోబార్ రాజు పాల్గొన్నారు.

'కేంద్రంలో మోదీ పాలనకు ప్రజాదరణ'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

నర్సంపేట : కేంద్రంలో ప్రధాని మోదీ పాలనకు ప్రజాదరణ లభిస్తోందని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు బాల్నె జగన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక చరిత్రను సృష్టించిందన్నారు. మోదీ సంకీర్ణ రాజకీయాలకు తావులేకుండా బలమైన ప్రభుత్వాన్ని నెలకొల్పారని చెప్పారు. బడుగులకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తొలుత వ్యాపారస్తుడు బాల్నె సర్వేశంను కలిసి బీజేపీకి పార్లమెంటులో అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పట్టణంలోని రామాలయంలో పూజలు నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, నాయకుడు కంభంపాటి ప్రతాప్, రాణాప్రతాప్‌రెడ్డి, బీజేవైఎం నియోజకవర్గ అధ్యక్షుడు జూలూరి మనీశ్, కౌన్సిలర్లు శీలం రాంబాబు, మినుముల రాజు, బానోతు వీరన్ననాయక్, సీనియర్ నాయకులు కునమల్ల పృథ్వీరాజ్, బీజేవైఎం పట్టణ కమిటీ అధ్యక్షుడు గూడూరు సందీప్, నాయకులు సూత్రపు సరిత, జల్లి మధు, గంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి



వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్‌చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ, ఎలేందర్‌రెడ్డి మాట్లాడారు. తమపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, కౌన్సిలర్లు తోటకూరి రాజమణి, మంచాల రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు కంజర్ల రవీందర్, పాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలి

చెన్నారావుపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో అబ్బదాసి అశోక్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్మిక, కర్షక మండల సదస్సుకు బాబు, సమ్మయ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గడచిన పదేళ్లలో అనుసరించిన తప్పుడు విధానాలతో దేశం దివాలా తీసిందన్నారు. ప్రజల సంపదను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టిందని విమర్శించారు. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం 2018 నుంచి 2022 వరకు దేశంలో పేదల సంఖ్య 19 కోట్ల నుంచి 35 కోట్లకు పెరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యుడు బిల్లా భూపాల్‌రెడ్డి, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధూకర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సమ్మయ్య

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధేశ్వరాలయంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికులు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కుండె కుమారస్వామి, తోట రాముడు, గట్ల రాంబాబు, లక్క కుమారస్వామి, కేతిడి జైపాల్‌రెడ్డి, కుండె రవి, మహ్మద్ వసీం అక్రమ్, తదితరులు మాట్లాడారు. సిద్ధేశ్వరాలయంలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కంది గోపాల్‌రెడ్డి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. వెంటనే సదరు నిర్మాణ పనులను నిలిపేయాలని కోరారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవండి



విద్యార్థులతో సాంబయ్య, తదితరులు

చెన్నారావుపేట : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని స్థానిక హైస్కూల్ పూర్వవిద్యార్థి ములక సాంబయ్య (శిల్పా జగదీష్) సూచించారు. ఆ స్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంబయ్య పరీక్ష సామగ్రిని గురువారం అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి 10 జీపీఏ సాధించాలని చెప్పారు. రవికుమార్ మాట్లాడుతూ 10 జీపీఏ సాధించిన విద్యార్థుల పేరిట లైబ్రరి ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్‌ఎం పాపమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్వవిద్యార్థి సాంబయ్య సామగ్రి అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు ములుక ఐలయ్య, ఉపాధ్యాయులు రవి, కిశోర్, ఉమాదేవి, రజిని, శ్రీనివాస్‌రెడ్డి, నిర్మలదేవి, అనిల్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు కుమారస్వామి, రాకేష్, సీఆర్పీ సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా కమిటీ ఎన్నిక

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వెండి సక్కుబాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్రి సునీత, ప్రధాన కార్యదర్శిగా ఎల్లబోయిన రాజక్క, ఉపాధ్యక్షులుగా అక్కెపెల్లి రమ, మునుకుంట్ల సుజాత, కోశాధికారిగా నల్ల శాంత, ఆర్గనైజర్‌గా భూమ సుజాత ఎన్నికయ్యారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

నర్సంపేట : గోర్ బంజారాల ఆరాధ్య దైవమైన క్రాంతికారి సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఏటా ఫిబ్రవరి 15న సెలవు దినంగ ప్రకటించాలని గోర్ సిక్వాడి జిల్లా అధ్యక్షుడు బోడ కిషన్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన ఆకాంక్షించారు. యువత సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్ర తెలుసుకుని ప్రజాచైతన్యానికి పాటుపడాలని సూచించారు. అన్ని తండాల్లో సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు.

నర్సయ్య మృతి విప్లవోద్యమాలకు లోటు

నల్లబెల్లి : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాజీ దళ నాయకుడు, మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెన్నమల నర్సయ్య అకాల మృతి విప్లవోద్యమాలకు లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిన్న చంద్రన్న తెలిపారు. మండలంలోని నారక్కపేటలో జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సంతాపలో చంద్రన్న పాల్గొని మాట్లాడారు.తొలుత నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో మాజీ ఎంపీపీలు బానోత్ సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్ రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, ప్రజాపంథా జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్, కొత్తపల్లి రవి, ఈర్ల పైడి, బండి కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

హామీల అమలుకు ఉద్యమాలు తప్పవు

నర్సంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమాలు తప్పవని ఎంసీపీఐ (యూ) జిల్లా నాయకుడు కేశెట్టి సదానందం స్పష్టం చేశారు. మండలంలోని నాగుర్లపల్లిలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమౌతుండగా పాలకపార్టీలు హామీలు గుప్పించి అధికారంలోకి వస్తున్నాయని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసి అధికారం కోల్పోయిందని చెప్పారు. సమావేశంలో నాయకులు కొత్తకొండ రాజమౌళి, జావాజి చంద్రమౌళి, కందికొండ నర్సింహస్వామి, కానుగంటి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

యువత దేశసేవలో భాగస్వాములు కావాలి



నర్సంపేట : యువత సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో దేశసేవలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ కోరారు. మండలంలోని ఎదల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ సైనికుడు చలమల్ల రాజారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం పట్టణానికి గురువారం చేరుకోగా ఆయనకు యువత ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో విశ్రాంత సైనికుడు రాజారెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం సాంబయ్య మాట్లాడారు. యువత దేశ రక్షణకు సేవలు అందించడంలో పోటీ పడాలన్నారు. సైనికులే నిజమైన దేశభక్తులని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండెం రతన్‌కుమార్, నాంపల్లి వెంకన్న, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, బాలు, కోమాండ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



నర్సంపేట రూరల్: పనులు పరిశీలిస్తున్న ఎంపీఓ



నల్లబెల్లి : లెంకాలపల్లిలో..



నెక్కొండలో..

నర్సంపేట రూరల్ : ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంపీఓ, ముగ్దుంపురం ప్రత్యేకాధికారి సునీల్‌కుమార్‌రాజ్ తెలిపారు. ఆ గ్రామంలో పంచాయతీ కార్మికులు గురువారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. జీపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కలను సమర్థవంతంగా పెంచాలని సూచించారు.

నల్లబెల్లి : మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చిమొక్కలను తొలగించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి కాల్వల్లో పూడిక తీశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కూచన ప్రకాశ్ మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.

నెక్కొండ : మండలంలోని గొల్లపల్లిలో పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మురికి కాల్వల్లో పూడిక తీసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి నాగరాజు మాట్లాడారు. ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

రాయపర్తి : పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమీక్షా సమావేశంలో ఝాన్సీరెడ్డి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ప్రజలు, పార్టీ శ్రేణులు సమస్యలపై తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. భూకబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా శ్రేణులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, నంగునూరి అశోక్, మహేందర్‌రెడ్డి, ఎనగందుల మురళి, ముద్రబోయిన వెంకన్న, సుదర్శన్‌రెడ్డి, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, ఉల్లెంగుల యాదగిరి, భూక్య సమ్మయ్య, గుగులోతు శ్రీను, గబ్బెట బాబు, ఇల్లందుల భగవాన్, ఎల్లయ్య, మునిత, షాజహాన్, చిన్నపాక ఎల్లయ్య, మద్దెల వెంకటేశ్, పుల్లూరి దామోదర్, వల్లపు కుమార్, హరినాథ్, ఓరుగంటి వెంకన్న, బండి రాజేంద్రప్రసాద్, కల్యాణ్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు హ్యాండ్ రెస్ట్ ప్రాజెక్టు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అందె స్పందన రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం జయ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థిని స్పందన, గైడ్ టీచర్ పిన్నింటి బాలాజీరావు, సహకరించిన ఉపాధ్యాయులు జన్నపురెడ్డి ఉమారాణి, పర్వత రమణారావు, సుందర్, మోహన్‌రావును అభినందించారు. గైడ్ టీచర్ బాలాజీరావు మాట్లాడుతూ కేవలం రూ.300 ఖర్చుతో అందుబాటులో ఉన్న సామగ్రితో గాయపడిన చేతికి అమర్చేందుకు హ్యాండ్ రెస్ట్ ప్రాజెక్టును రూపొందించినట్లు వివరించారు. విద్యార్థిని స్పందన మాట్లాడుతూ చేతికి గాయాలతో ఇబ్బందులు పడుతున్న వారిని చూసి ఈ పరికరాన్ని తయారు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మమత, మాధవి, పీఈటీ రవీందర్ పాల్గొన్నారు.

లింగాపురం విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక

లింగాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఇమ్మడి విఘ్నేష్‌కుమార్ రూపొందించిన 'సైకిల్‌కు బహుళ సాధక ట్రాలీ' అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అబ్దుల్ సలీం తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థిష్‌తోపాటు గైడ్ టీచర్ పరమేశ్వర్‌ను అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విఘ్నేశ్



ప్రాజెక్టుతో స్పందన

భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం



ర్యాలీ నిర్వహిస్తున్న హిమవర్షిణి, తదితరులు

పర్వతగిరి : భూసారం ఆధారంగానే ఎరువుల వినియోగం ఉండాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పీయూ మేనేజర్ హిమవర్షిని సూచించారు. మండలంలోని సీకేతండాలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్-బీసీఐ, హెచ్ అండ్ ఎం ప్రాజెక్టులో భాగంగా ఆ కంపెనీ ఆధ్వర్యంలో నేల ఆరోగ్యంపై గురువారం నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. పూర్వం రైతులు చాలా శ్రద్ధతో సమగ్ర పోషకాలు అందించి నేల ఆరోగ్యాన్ని కాపాడారని తెలిపారు. ప్రస్తుతం కొందరు రైతులు సరైన అవగాహన లేక రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగించి భూమిలోని సేంద్రియ కర్బనపదార్థం లేకుండా చేస్తున్నారని చెప్పారు. ఈటీఎల్ ఆధారంగా పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. రైతులు చైతన్యవంతులై భూమిని, వాతావరణాన్ని, భూమిపై నివసించే ప్రాణకోటి జీవులను కాపాడడంతోపాటు భవిష్యత్ తరాలు పసిడి పంటలు పండించేలా భూసారాన్ని పెంచాలని ఆకాంక్షించారు. సేంద్రియ సాగును ఆచరించి వర్మి కంపోస్టును వాడాలని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ కార్యకర్తలు కందికట్ల సైకిలాబ్ బాబు, జలగం సుజాత, జాటోతు భద్రునాయక్, వెంకటలక్ష్మి, కోమల తదితరులు పాల్గొన్నారు.

'సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

రాయపర్తి : సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని కాట్రపల్లిలో సుమన్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నోముల లింగయ్య చిట్యాల సత్తయ్య, యాకయ్య, కందుకూరి నరేందర్, కర్ణె యాకయ్య, నాసర్, చిట్యాల వెంకన్న, బోనగిరి సతీశ్, చెన్నబోయిన దిలీప్, బూడిద యాకయ్య, బూడిద మహేశ్, గుండ్లపల్లి యాకయ్య, గుండ్లపల్లి మధు, చిన్నపాక రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు